సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 28 । నవంబర్ । 2023



పోలింగ్ ప్రక్రియ ఇలా.. 6లో▸
ఎన్నికల పర్వంలో పోలింగ్ రోజు కీలకం. ఇందులో సిబ్బంది విధులు, స్ట్రాంగ్‌రూంకు ఈవీఎంల తరలింపు వంటివి ప్రధానం.

ఘనంగా శేషవాహన సేవ



జైనథ్‌లోని శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్స వాల్లో భాగంగా స్వామి వారి శేషవాహన సేవ ఘనంగా నిర్వహించారు. 6లో▸

గరిష్టం/కనిష్టం
27.0/19.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. శీతల గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పోస్టల్ బ్యాలెట్ గడువు పెంచాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల విధుల్లో ఉన్నవారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడానికి గడువు పెంచాలని టీయూపీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహాన్, వలభోజు గోపీకృష్ణ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పోస్టల్ బ్యాలెట్ గడువును ఈ నెల 29 వరకు పెంచాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ గల్లంతైన వారికి మరో అవకాశం కల్పించాలన్నారు. బోథ్ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయని వారికి జిల్లా కేంద్రంలోని సీపీఓ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ రోజు రాత్రి ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున తగిన రవాణ సౌకర్యం కల్పించాలని కోరారు.

ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో పలువురికి చోటు



చోటు దక్కిన కార్యవర్గ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన పలువురికి చోటు లభించిందని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, జాదవ్ అశోక్ తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వీరికి స్థానం కల్పించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా దిలేష్ చౌహాన్, ఉపాధ్యక్షుడిగా బెజ్జంకి రవీంద్ర, మహిళా ఉపాధ్యక్షురాలిగా శీతల్ చౌహాన్, క్రీడల కన్వీనర్‌గా నరేందర్, గిరిజన కో కన్వీనర్‌గా ఆనంద్‌రావు ఎన్నికైనట్లు తెలిపారు.

'అనుమతి లేకుండా ప్రకటనలు ప్రచురించకూడదు'

కైలాస్‌నగర్: ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎంసీఎంసీ అనుమతి లేకుండా పోలింగ్ రోజు, ముందు రోజైన ఈ నెల 29, 30 తేదీలలో ప్రింట్ మీడియాలో ఎలాంటి ఎన్నికల ప్రచార ప్రకటనలు ప్రచురించకూడదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఇతరులు ఎవరైనా ముందస్తుగా ఎంసీఎంసీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకుని ధ్రువీకరణ పొందాలని సూచించారు. లేనిపక్షంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే రీతిలో ఆవేశపూరితమైన, తప్పుదోవ పట్టించే, ద్వేషపూరిత ప్రకటనలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వబడదని స్పష్టం చేశారు.

28న జిల్లాస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్–17 బాలుర జిల్లాస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు తెలిపారు. జనవరి 1, 2007 తరువాత జన్మించినవారు అర్హులని పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ సొంత ప్లేయింగ్ కిట్లను తెచ్చుకోవాలని సూచించారు. అలాగే సంబంధిత వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

కార్తీకం కమనీయం



దీపాలు వెలిగిస్తున్న మహిళ



గోపాలకృష్ణ మఠంలో దీపోత్సవం




దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఇంటి వద్ద తులసీ కల్యాణం

కార్తీక పౌర్ణమి సందర్భంగా పలు ఆలయాల్లో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణమఠంలో విఠలేశ్వరుని మందిరంలో దీపోత్సవం నిర్వహించారు. మహిళలు, యువతులు దీపాలు వెలిగించారు. జిల్లా కేంద్రంలోని మంగమఠం, ఉమామహేశ్వర ఆలయం, శ్రీ రాజరాజేశ్వర ఆలయం, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల తాకిడి కనిపించింది. అలాగే తులసీ కల్యాణాన్ని భక్తశ్రద్ధల నడుమ నిర్వహించారు. – ఆదిలాబాద్

పోరు రసవత్తరం



ఆదిలాబాద్‌లో..
బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న
కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి
బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్
స్వతంత్ర అభ్యర్థి అల్లూరి సంజీవ్‌రెడ్డి

బోథ్‌లో..
బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్
బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావు
కాంగ్రెస్ అభ్యర్థి ఆడె గజేందర్

- ఆదిలాబాద్‌లో చతుర్ముఖం
- బోథ్‌లో త్రిముఖం
- నేటితో ముగియనున్న ప్రచారం



సాక్షి,ఆదిలాబాద్: ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. ప్రచార పర్వం నేటితో ముగియనుంది. ఈ నెల 30న ఎన్నికలు జరగనుండగా, డిసెంబర్ 3న ఫలితాలు వెలబడనున్నాయి. రణరంగంలో ఎవరు విజేతనో తేలిపోతుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల, నోటిఫికేషన్, అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ, ఉపసంహరణ, ఆ తర్వాత బరిలో నిలిచిన అభ్యర్థుల ప్రచారపర్వంతో మొత్తంగా కోలాహలం నెలకొంది. ఆ పార్టీ అధికారం నిలుపుకుంటుందా.. ప్రతిపక్ష పార్టీలు పాగా వేస్తాయా.. స్వతంత్రుల ప్రభావం ఏమైనా ఉంటుందా.. ఇలా ఎన్నికల ఫలితాలపై అందరిలో ఆసక్తి నెలకొంది.

పోరు ఇలా..

- ఆదిలాబాద్ నియోజకవర్గంలో చతుర్ముఖ పోరు నెలకొంది. బీఆర్ఎస్ నుంచి జోగు రామన్న, కాంగ్రెస్ నుంచి కంది శ్రీనివాస రెడ్డి, బీజేపీ నుంచి పాయల్ శంకర్‌తో పాటు కాంగ్రెస్ రెబల్‌గా బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థి అల్లూరి సంజీవ్‌రెడ్డి రేసులో ఉన్నారు.
- బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్, బీజేపీ అభ్యర్థి సోయం బాపురావు, కాంగ్రెస్ అభ్యర్థి ఆడె గజేందర్ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. ఆదిలాబాద్, బోథ్‌లో అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి తమను ఆదరించాలని కోరారు.

ప్రచారపర్వం ఇలా..

ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్ తరఫున సీఎం కేసీఆర్, ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు, బోథ్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభల్లో పాల్గొన్నారు. బీజేపీ పరంగా ఆదిలాబాద్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఈటల రాజేందర్ బహిరంగ సభలో పాల్గొన్నారు. బండి సంజయ్ రోడ్‌షోలో కూడా పాల్గొన్నారు. బోథ్‌లో బీజేపీ పరంగా అధినేతలెవరు రాలేదు. కాంగ్రెస్ పరంగా ఆదిలాబాద్‌లో అగ్రనేత రాహుల్ గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిల బహిరంగ సభలు నిర్వహించారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ రోడ్‌షో, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చౌహాన్‌లు పర్యటించారు. బోథ్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో పాల్గొన్నారు. అలాగే ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ రెబల్‌గా పోటీ చేస్తున్న అల్లూరి సంజీవ్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. సాజిద్‌ఖాన్, గంద్రత్ సుజాతతో కలిసి ఓటర్లను కలిసి ఆదరించాలని కోరారు.

కేసీఆర్ కుటుంబమే బాగుపడింది



రోడ్ షోకు హాజరైన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

- ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేష్ సింగ్ బఘేల్
- ఆదిలాబాద్‌లో రోడ్‌షో
- కాంగ్రెస్ అభ్యర్థి 'కంది'కి మద్దతుగా ప్రచారం



రోడ్‌షోలో పాల్గొన్న ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేష్

కైలాస్‌నగర్: బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం బాగుపడిందే తప్ప సామాన్యులకు ఎలాంటి మేలు చేకూరలేదని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ సింగ్ బఘేల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆదిలా బాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డికి మద్దతుగా జిల్లా కేంద్రంలో సోమవారం రోడ్ షో నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన ఈ రోడ్ షో ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీని వాసరెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజలకు అందించాలనేదే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కర్నాటక ఎమ్మెల్సీ ప్రకాశ్‌రాథోడ్, మహారాష్ట్ర మాజీ మంత్రి అనీస్ అహ్మద్, ఏఐసీసీ సభ్యుడు అబ్బాస్, టీపీసీసీ పరిశీలకులు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ప్రత్యేక హెలి క్యాప్టర్‌లో జిల్లా కేంద్రానికి చేరుకున్న సీఎం భూపేష్‌కు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు.

మోదీ, కేసీఆర్‌ల హామీలకు గ్యారంటీ లేదు..

అనంతరం ప్రజాసేవా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భూపేష్ బఘేల్ మాట్లాడారు. ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్‌లిచ్చే హామీలకు ఎలాంటి గ్యారంటీ ఉండదన్నారు. మోదీ, కేసీఆర్ ఇద్దరిదీ ఒకే విధానమని, వారు అంతర్గత మిత్రులని విమర్శించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ గడిచిన పదేళ్లలో దోచుకోవడమే లక్ష్యంగా పాలన సాగించారన్నారు. భూమి, ఇసుక, మద్యం, ఖనిజం వంటి సహజ వనరులను దేన్నీ వదల్లేదన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో 24 గంటలు కరెంటిస్తున్నామంటున్నారని, అయితే ఆ కరెంటు తామే సప్లై చేస్తున్నామని, అందుకు సంబంధించిన బకాయిలు కేసీ ఆర్ సర్కార్ ఇంకా తమకు చెల్లించలేదని ఆరోపించారు. అనంతరం ఏఐసీసీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తానని పేర్కొంటూ రాసిన బాండ్ పేపర్‌పై కంది శ్రీనివాసరెడ్డి సంతకం చేసి దానిని సీఎం భూపేష్‌కు అందించారు. సమావేశంలో మహారాష్ట్ర మాజీ మంత్రి అనీస్ అహ్మద్, టీపీసీసీ సభ్యులు అబ్బాస్, టీపీసీసీ కార్యదర్శి వెంకటేశం పాల్గొన్నారు.

నేటి సాయంత్రం నుంచి మద్యం దుకాణాలు బంద్

- ఈనెల 30 వరకు..

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి ఈనెల 30న పోలింగ్ ముగిసే వరకు మద్యందుకాణాల బంద్ పాటించాలని ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. అలాగే డిసెంబర్ 3 ఎన్నికల ఫలితాల దృష్ట్యా మద్యం షాపులు మూసి ఉంచాలని సూచించారు. అక్రమ మద్యం, బెల్టుషాపుల నిర్వహణపై జిల్లాలో గతనెల 9 నుంచి సోమవారం వరకు 452 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. 118 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. ఈ దాడుల్లో 2776.25 లీటర్ల బెల్లంపానకం, గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే 586.16 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు చెప్పారు. 578 గంజాయి మొక్కలను ధ్వంసం చేసి 18.6 కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నట్లు పేర్కొన్నారు. 773.94 లీటర్ల దేశీదారు, 250 కిలోల నల్లబెల్లం సీజ్ చేసినట్లు తెలిపారు. 1882 లీటర్ల తెల్లకల్లు ధ్వంసం చేసి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే 4 కార్లు, 5 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు వివరించారు.

అకాల వర్షం.. పత్తిపై ప్రభావం

- జిల్లాలో 418.6 మి.మీ. వర్షపాతం
- పెరిగిన చలితీవ్రత



వడ్డాడి శివారులో వర్షానికి తడిసిన పత్తిపంట

ఆదిలాబాద్‌టౌన్: బంగాళఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లాలో అకాల వర్షం కురిసింది. సోమవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు ఓ మోస్తారుగా కురిసింది. జిల్లా వ్యాప్తంగా కలిపి 418.6 మి.మీ.లుగా నమోదైంది. ఈ వర్షంతో పత్తి పంట దెబ్బతింది. జిల్లాలో అధిక శాతం మంది రైతులు ఈ సీజన్‌లో పత్తి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పత్తి ఏరేందుకు సిద్ధంగా ఉంది. ఈ సమయంలో కురిసిన వర్షంతో చేతికొచ్చిన పంట తడిసి ముద్దయి నల్లగా మారే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు నాణ్యత సైతం దెబ్బతింటుందని ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికే అధిక తేమ కారణంగా పత్తికి మద్దతు ధర లభించని పరిస్థితి ఉండగా, ఈ వర్షం వారిని మరింతగా కుదిపేసింది. ఉదయం నుంచి రాత్రి వరకు శీతల గాలులు వీచాయి. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో అత్యధికంగా ఆదిలాబాద్‌రూరల్, ఆదిలాబాద్‌అర్బన్‌లో 52.2 మి.మీ. చొప్పున, అత్యల్పంగా గాదిగూడలో 4.2 మి.మీ.ల వర్షం నమోదైంది. అలాగే జైనథ్‌లో 23.2 మి.మీ., బేలలో 16.4 మి.మీ., గుడిహత్నూర్‌లో 22.6 మి.మీ., భీంపూర్‌లో 25.6 మి.మీ., మావలలో 34.4మి.మీ., తాంసిలో 32 మి.మీ., తలమడుగులో 32.8 మి.మీ., బజార్‌హత్నూర్ 25.6 మి.మీ., బోథ్‌లో 214. మి.మీ., నేరడిగొండలో 10.8మి.మీ., ఇచ్చోడలో 15.2 మి.మీ., సిరికొండలో 16.4 మి.మీ., నార్నూర్‌లో 4.6 మి.మీ., ఇంద్రవెల్లిలో 17.8 మి.మీ., ఉట్నూర్‌లో 11.2 మి.మీ.ల వర్షం కురిసింది.

పోలింగ్‌కు పకడ్బందీ చర్యలు

- ఓటింగ్‌శాతం పెంచేలా మోడల్ కేంద్రాలు
- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఎన్నికల ఏర్పాట్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డులు, స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎంల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు వంటి అంశాలపై కలెక్టర్‌కు వికాస్‌రాజ్ పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పోలింగ్ నిర్వహణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలు, యువత, దివ్యాంగుల కోసం మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులకు సమాచారం అందించాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాల నిర్వహణలో మైక్రోఅబ్జర్వర్ల పాత్ర కీలకమన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను స్థానిక టీటీడీసీలో అలాగే బోథ్ నియోజకవర్గానికి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం జూనియర్ కళాశాల మైదానం బోథ్‌లో, రిసెప్షన్ కేంద్రం ఆదిలాబాద్ టీటీడీసీలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ అనంతరం కేంద్రాల నుంచి స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంల తరలింపు కోసం అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ రోజు సిబ్బంది సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని, మాక్‌పోల్ నిర్వహించాలన్నారు. ఆయా కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహణ, కంట్రోల్ రూమ్ ఏర్పాటు, పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షణకు తీసుకోవలసిన చర్యలపై వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, బోథ్, ఆదిలాబాద్ రిటర్నింగ్ అధికారులు చాహత్ బాజ్‌పాయ్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటు హక్కు కోసం దుబాయ్ నుంచి రాక



దుబాయ్ నుంచి వచ్చిన భూమేష్

లక్ష్మణచాంద: ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకోవడానికి మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన యువకుడు కుంటాల భూమేష్ ఏకంగా దుబాయ్ నుంచి తన సొంత గ్రామానికి వచ్చాడు. సోమవారం దు బాయ్ నుంచి వచ్చిన భూమేష్ ఇంద్రకరణ్ రెడ్డిపై ఉన్న అభిమానంతో గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నాడు. కేవలం ఓ టు హక్కును వినియోగించుకోవడం కోసమే తను ఇంటికి వచ్చినట్లు భూమేష్ తెలిపాడు.

బేస్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో సాయిరాం



బెండే సాయిరాం

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన బెండే సాయి రాం బేస్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. ఈ నెల 9న మెదక్ జిల్లా మనోహరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చాడు. రాష్ట్రస్థాయి జట్టులో ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి జట్టుకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికయ్యాడు. ఈ 24 నుంచి 27వ తేదీ వరకూ పంజాబ్ రాష్ట్రంలోని అకాల్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో నిర్వహించిన 36వ బేస్ బాల్ జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ తరఫున పాల్గొన్నాడు. సాయిరాంను బేస్‌బాల్ జిల్లా అధ్యక్షుడు తుల శ్రీనివాస్, కార్యదర్శి రాజశేఖర్‌తో పాటు కోచ్‌లు గౌతమ్, గంగాధర్, పీఈటీలు అజయ్ అభినందించారు.

తృటిలో తప్పిన ప్రమాదం



పిడుగుపాటుతో కాలిపోయిన విద్యుత్‌వైర్లు

సోన్: వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం పిడుగు పడిన సంఘటన మండలం కూచన్‌పెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం.. ఉదయం ఒక్కసారిగా వర్షం కురిసింది. ఆ సమయంలో అమీద్‌ఖాన్, మహ్మద్ అలీమ్ తండ్రికొడుకులు పంట పొలానికి వెళ్తూ వర్షం రావడంతో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం పక్కన గల రేకులషెడ్డు కిందకు వెళ్లారు. అదే సమయంలో మెరుపులతో కూడిన భారీ శబ్దం వచ్చింది. దీంతో వారు స్పృహ తప్పి పడిపోయారు. ఆలయంలోని విద్యుత్ మెన్ బోర్డు, బల్బులు, వైర్లు పూర్తిగా కాలిపోయాయి.

పోలింగ్ ప్రక్రియ ఇలా..

నిర్మల్‌ఖిల్లా: ఎన్నికల పర్వంలో పోలింగ్ రోజు అత్యంత కీలకం. అయితే ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈవీఎంల తరలింపు మొదలుకొని ఓటింగ్ ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతుంది. ముగిసిన అనంతరం కౌంటింగ్ కేంద్రాల వద్ద గల స్ట్రాంగ్ రూములకు తరలించే వరకు కొనసాగే ప్రక్రియ, పోలింగ్ అధికారుల విధులు, పోలింగ్ ఏజెంట్ల బాధ్యతలు, తదితర అంశాలపై ప్రత్యేక కథనం...

- ఎన్నికల సిబ్బంది విధులు, పోలింగ్ ఏజెంట్ల బాధ్యతలు
- పోలింగ్ మొదలుకొని కౌంటింగ్ కేంద్రాల వరకు..
- వివిధ దశల్లో అనుక్షణం అప్రమత్తం
- సమన్వయంతోనే సజావుగా పూర్తి..



ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు ఇప్పటికే రెండు విడుతలుగా శిక్షణ పూర్తయింది. అయితే పోలింగ్ అధికారుల విధులు, బాధ్యతలు ఎన్నికల రోజు ఆయా రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లు పాత్ర కీలకంగా ఉంటుంది..

ఈ నెల 29న పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాల వారిగా కేటాయించబడిన పోలింగ్ సిబ్బంది ఒక్కో కేంద్రానికి నలుగురు ఒకరోజు ముందే నియోజకవర్గ కేంద్రాల్లోని రిటర్నింగ్ అధికారుల వద్ద నుండి ఎన్నికల సామగ్రిని స్వీకరించి సంబంధిత పోలింగ్ కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది.

మాక్ పోలింగ్‌తో మొదలు...

ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల ఆధీనంలో ఉన్న ఈవీఎం యంత్రాలతో పాటు సిబ్బంది 29నే తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారు. పోలింగ్ రోజు ఉదయం 5:30 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తరఫున వచ్చిన పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 6:30 లోపే మాక్ పోలింగ్ ప్రక్రియను ముగించాలి. మాక్ పోలింగ్‌లో 50 ఓట్లకు తగ్గకుండా ఓట్లు వేసి ఏజెంట్ల సమక్షంలో లెక్కిస్తారు. ఇందులో నోటాకు సైతం ఓట్లు వేసి పరిశీలించాల్సి ఉంటుంది. అన్నిసరిగానే ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత వారి సమక్షంలో ఈ యంత్రాలను క్లియర్ చేసి ఓటింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారు. ఉదయం 7గంటలకు ఓటింగ్ ప్రారంభమవుతుంది.

పోలింగ్ ఏజెంట్ల పాత్ర ..

ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ కేంద్రాలలో రాజకీయ పార్టీల అభ్యర్థుల తరఫున పోలింగ్ ఏజెంట్లు ఉంటారు. ఓటు వేయడానికి వచ్చిన ఓటరు నిజమైన వ్యక్తి లేదా బోగస్ ఓటరా అని పోలింగ్ ఏజెంట్లు నిశితంగా పరిశీలిస్తారు. పోలింగ్ కేంద్రంలో ప్రతి అభ్యర్థి తరఫున ఒక పోలింగ్ ఏజెంటు ఇద్దరు రిలీఫ్ ఏజెంట్లను నియమించుకోవచ్చు. అందులో ఒక్కరు మాత్రమే కూర్చోడానికి అవకాశం ఉంటుంది. పోలింగ్ ఏజెంట్లు ఫారం 10లో పోటీ చేస్తున్న అభ్యర్థి లేదా అతని ఎన్నికల ఏజెంట్ నియామక పత్రం పొందిన వారికి ఏజెంట్ పాసును జారీ చేస్తారు. ఓటరు జాబితాను బయటకు తీసుకు వెళ్లేందుకు వీలు ఉండదు పోలింగ్ ఏజెంట్లు స్థానికుడై ఉండి ఎన్నికల కమిషన్ అనుమతించిన ఫొటో గుర్తింపు కార్డును కలిగి ఉండాలి.

రెండు గంటలకొసారి పోలింగ్ శాతం వెల్లడి..

పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ప్రతి రెండు గంటలకు ఓసారి పోలింగ్ శాతాన్ని ఎన్నికల అధికారులు అధికారికంగా వెల్లడిస్తారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 17-ఏ రిజిస్టర్లో నమోదైన ఓట్లు, ఓటర్ స్లిప్పులు, కంట్రోల్ యూనిట్లలో గల మొత్తం నమోదైన ఓట్లు ఏకీభవించాలి. అప్పుడే పోలింగ్ శాతాన్ని ప్రకటించాల్సి ఉంటుంది. పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓటింగ్ శాతాన్ని ప్రిసైడింగ్ అధికారులు సంబంధిత సెక్టార్ అధికారులకు పంపుతారు. సెక్టారు అధికారులు జిల్లా ఎన్నికల అధికారులకు సమాచారాన్ని అందిస్తారు.

పోలింగ్ అధికారుల విధులు ఇలా...

ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించడంలో పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వర్తించే సిబ్బందిదే బాధ్యత. ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారితో పాటు ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారి మరో ఇద్దరు ఇతర ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణ బాధ్యతల్లో ఉంటారు. పోలింగ్ కేంద్రం మొత్తం బాధ్యతను ప్రిసైడింగ్ అధికారి పర్యవేక్షిస్తారు.

పోలింగ్ ముగింపు...

పోలింగ్ సమయం ఐదు గంటలకు ముగుస్తుండగా 15నిమిషాల ముందే వెల్లడించాల్సి ఉంటుంది. సాయంత్రం ఐదు గంటల లోపు పోలింగ్ కేంద్రం లోపల ఉన్నవారందరూ ఓటు వేయటానికి అర్హులే. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కంట్రోల్ యూనిట్‌లో క్లోజ్ బటన్ నొక్కుతారు. అనంతరం కంట్రోల్ యూనిట్‌లో మొత్తం ఓట్లు 17-ఏ లో గల మొత్తం ఓట్లు, ఓటర్ స్లిప్పులు సరిపోలతో ఉన్నాయా లేదా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

కౌంటింగ్ కేంద్రాలకు చేరేదిలా...

పోలింగ్ ముగిసిన వెంటనే సీల్ వేసి క్లోజ్ చేసిన ఈవీఎం యంత్రాలను ఆయా నియోజకవర్గాల్లో పంపిణీ కేంద్రాలకు చేరుస్తారు. ఆ మరుసటి రోజు ప్రత్యేక భద్రత మధ్య ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన లెక్కింపు కేంద్రాలవద్దగల స్ట్రాంగ్ రూంలోనికి తరలిస్తారు.

ఆదిలాబాద్ జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు	
ఆదిలాబాద్: 290, బోథ్: 302	
మొత్తం: 592	

నిర్మల్ జిల్లాలో పోలింగ్ కేంద్రాలు	
ఖానాపూర్: 305	
నిర్మల్: 306	ముథోల్: 311
మొత్తం: 922	

మంచిర్యాల జిల్లాలో	
మంచిర్యాల: 289	
చెన్నూర్: 227	బెల్లంపల్లి: 227
మొత్తం: 743	

ఆసిఫాబాద్‌లో జిల్లాలో..
ఆసిఫాబాద్: 305, సిర్పూర్: 294
మొత్తం: 599

తానూరులో భక్తజన జాతర

- ఆకట్టుకున్న కుస్తీ పోటీలు
- ఆసక్తిగా తిలకించిన భక్తజనం



రథం లాగేందుకు పోటీపడుతున్న భక్తులు

తానూరు: మండల కేంద్రంలోని విఠలేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం జరిగిన జాతరకు భక్తులు పోటెత్తారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా సమీప గ్రామాలతోపాటు సరిహద్దు మహారాష్ట్రవాసులు హాజరయ్యారు. మరో పండరిపురంగా భావించే ఈ ఆలయానికి చేరుకుని విఠలరుక్మాబాయి దర్శనం చేసుకుని మొక్కు తీర్చుకున్నారు. మండల కేంద్రంలోని ఇళ్లన్నీ బంధువులతో సందడిగా మారాయి. తానూరు ప్రధాన రహదారి, పోలీస్‌స్టేషన్ ప్రాంతం, సంత స్థలం, హైస్కూల్ ఆవరణ అంతా చిరుదుకాణాలతో నిండిపోయింది. ఉదయం నుంచి రాత్రి వరకు కిక్కిరిసిన జనంతో కొనుగోళ్ల సందడి కనిపించింది. చిన్నాపెద్దా తేడా లేకుండా రంగుల రాట్నంలో తిరుగుతూ ఉత్సాహంగా కనిపించారు. ఆదివా రం అర్ధరాత్రి రథయాత్ర నిర్వహించగా లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. సాయంత్రం పూజలు చేశాక భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం హైస్కూల్ ఆవరణలో విఠలేశ్వర ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో కుస్తీ పోటీలు ప్రారంభించారు. మహా రాష్ట్రలోని ఔరంగాబాద్, నాందేడ్, పర్భణి, పుణేతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు కుస్తీలో తలపడ్డారు. విజేతకు రూ.11,111 తో పాటు వెండి కడియం, ద్వితీయ స్థానంలో నిలి చిన మల్లయోధుడికి రూ.8,851తో పాటు వెండి కడియం బహూకరించి సన్మానించారు. కాగా, ఇక్కడ నిర్వహించే జాతర 105 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో ఉత్సవాలు మరింత వైభవంగా నిర్వహించారు. భక్తులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించారు. ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

భారీగా మద్యం స్వాధీనం

- ముగ్గురిపై కేసు నమోదు
- 876బాటిళ్లు, ఆటో, సెల్‌ఫోన్ సీజ్

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా తరలిస్తున్న భారీ మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మేరకు సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఠాగూర్ హోటల్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో క్రాంతినగర్‌కు చెందిన షేక్ అఫ్రోజ్, షేక్ కలీంలు ఆటోలో దాదాపు రూ.లక్షా 30వేల విలువ గల 876 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డి.సాయినాథ్, వన్‌టౌన్ సీఐ కె.సత్యనారాయణలు సంయుక్తంగా పట్టుకున్నారు. విచారణలో సంజయ్ కుమార్ అనే వ్యక్తి ఈ మద్యం బాటిళ్లను తీసుకురావాలని చెప్పారన్నారు. ముగ్గురిపై వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఒక ఆటోతో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మద్యం పట్టుకున్న పోలీసులను ఎస్పీ అభినందించారు.

మద్యం పట్టివేత

తాంసి: భీంపూర్ మండలంలో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను భీంపూర్ ఎస్సై లాల్‌సింగ్‌నాయక్ సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. అక్రమంగా మద్యం తరలిస్తున్నారని ముందస్తు సమాచారం మేరకు భీంపూర్ వద్ద సిబ్బందితో కలిసి ఎస్సై తనిఖీలు నిర్వహించారు. భీంపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ అరవింద్, రాథోడ్ గణేష్ అనే వ్యక్తులు అక్రమంగా తరలిస్తున్న 180 ఎంఎల్ కలిగిన 192 మద్యం బాటిళ్లను గుర్తించారు. సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని మద్యాన్ని సీజ్ చేశారు. పట్టుకున్న మద్యం విలువ రూ.34వేల విలువ ఉంటుందని అంచనా వేశారు. ఎన్నికల వేళ అక్రమంగా మద్యం తరలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. వారి వెంట సిబ్బంది దినేష్ రాథోడ్, రమేష్, గోకుల్ ఉన్నారు.



పట్టుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు



సీజ్ చేసిన మద్యంతో పోలీసులు

అక్రమ మద్యం పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్ పట్టుకుని సీజ్ చేశారు. ఆదిలాబాద్ పట్టణంలో సోమవారం వాహన తనిఖీల్లో భాగంగా రూ.28వేలా 600 విలువ గల మద్యం పట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఇద్దరు వ్యక్తులపై వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో సంజయ్‌నగర్‌కు చెందిన షేక్ సల్మాన్ వద్ద 32బాటిళ్లు లభించాయి. వీటి విలువ రూ.7600 వరకు ఉంటుందన్నారు. అలాగే కలెక్టర్ చౌక్‌లో తలమడుగు మండలానికి చెందిన దివాకర్ వద్ద 24బాటిళ్లు లభించినట్లు తెలిపారు. వీటి విలువ రరూ.21వేలు ఉంటుందని పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని మావల పోలీసులు సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆదిలాబాద్ నుంచి ఇంద్రవెల్లి మండలానికి తరలిస్తుండగా 15లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వాటిని తరలిస్తున్న నానాక్‌సింగ్ అనే వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా శేష వాహన సేవ..



జైనథ్: మండల కేంద్రంలో కొలువైన శ్రీలక్ష్మీనారాయణ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారికి ఘనంగా శేషవాహన సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి శేషహోమం, బలిహరణం ఇత్యాది పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను శేషవాహనంలో ప్రతిష్ఠించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అలాగే కార్తీక పౌర్ణమి సందర్భంగా పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ గావించారు.

కార్తీక దీపోత్సవం..



దస్తురాబాద్: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని రేవోజీపేట, మున్యాల, బుట్టాపూర్, దస్తురాబాద్ గ్రామాల్లోని శివాలయాలు, మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ ఆలయంలో సోమవారం కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కారించుకొని ఇళ్లల్లో మహిళలు తులసీ పూజలు చేశారు.

పూలే జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో పొందుపరచాలి

- మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్

ఎదులాపురం: ప్రముఖ సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే, భారత్ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రలను పాఠ్య పుస్తకాల్లో పొందుపరచాలని అఖిల భారతీయ మాలి మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవంబర్ 28 సామాజిక ఉద్యమ పితామహుడు మహాత్మ జ్యోతిబాపూలే 133 వర్ధంతిని పార్టీలకతీతంగా నాయకులు, బహుజనవాదులు, మాలీకులస్తులు ఘనంగా నిర్వహించాలన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం జ్యోతిబాపూలే ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం జ్యోతిబాపూలే దంపతులకు భారతరత్న ప్రకటించి గౌరవించాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, మాలీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ అంబేకర్, అనిల్ కోట్రంగే, పట్టణ కార్యదర్శి సుభాష్ శేండే పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుకుమార్ పేట్కులే

సాధనతోనే గొప్ప క్రీడాకారులుగా ఎదుగుతారు

- జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి

ఆదిలాబాద్: నిరంతర సాధనతోనే గొప్ప క్రీడాకారులుగా ఎదగవచ్చని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సోమవారం ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాక్సింగ్ ఎంతో సాహసవంతమైన క్రీడ అని పేర్కొన్నారు. ఈ క్రీడలో రాణించాలంటే ఎంతో మనోధైర్యం ఉండాలన్నారు. ప్రస్తుతం జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజేతలు గా నిలుస్తుండటం శుభ పరిణామమన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు డిసెంబర్ 12 నుంచి మంచిర్యాలలో జరిగే ఉమ్మడి జిల్లా (జో నల్ స్థాయి) పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు, పెటా సంఘం ప్రధాన కార్యదర్శి స్వామి, బాక్సింగ్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సెక్రెటరీ శేఖర్, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు విజేందర్, బేగ్, బాక్సింగ్ కోచ్ సాయి ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా గిరిజన క్రీడల అధికారి

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

భైంసాటౌన్: పట్టణంలోని భట్టిగల్లికి చెందిన గడపాలే రాందాస్(36) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. రాందాస్ స్థానికంగా కూలీ పనులు చేస్తుండగా దాదాపు రెండేళ్ల కిందట భార్య, పిల్లలతో కలిసి వదిలివెళ్లడంతో ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసగా మారి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారమివ్వగా, వారు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఏరియాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆమోస్ తెలిపారు.

కనులపండువగా...

సోన్ : కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలం న్యూవెల్మల్, న్యూబొప్పారం గ్రామాల్లో సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా హన్మండ్ల పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. హనుమాన్ విగ్రహానికి ఒడి బియ్యం పోసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సల్లగుంజ ఎక్కే కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఇరు గ్రామాల సర్పంచ్‌లు అంకం గంగామణి, వెంకాయి హరితారెడ్డి పాల్గొన్నారు.

